క్లుప్తంగా

21న వృక్ష శాస్త్రంలో జాతీయ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగంలో ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ సదస్సు 'ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకోటూరిజం ఆన్ బయోడైవర్సిటీ' పోస్టర్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సంధ్యాదీపిక, ఆచార్య ఎస్.బి.పడాల్, ఆచార్య పి.కె.రత్నకుమార్, ఆచార్య బలరాం పడాల్, డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశముఖ్‌కు ఘన నివాళి



దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దుర్గాబాయి దేశముఖ్ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్య కె.శ్రీనివాసరావు, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి, డాక్టర్ పి.ఉష, డాక్టర్ జి.వీర్రాజు, ఆచార్య రాంజీ, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి స్వర్ణ శఠగోపం బహూకరణ



ఈవో ధర్మారెడ్డికి బంగారు శఠగోపం అందజేస్తున్న దాత శేషు మస్తాన్‌రావు

ఎంవీపీ కాలనీ: విశాఖ కార్తీక దీపోత్సవం కార్య నిర్వాహక సభ్యుడు, దాత పువ్వాడ శేషు మస్తాన్‌రావు కుటుంబం పద్మావతి అమ్మవారికి రూ.26 లక్షలు విలువ చేసే బంగారు శఠగోపం గురువారం బహూకరించింది. విశాఖ దీపోత్సవ కమిటీ ప్రతినిధి ఆధ్యాత్మిక వేత్త హిమాన్షు ప్రసాద్ ఆధ్వర్యంలో మస్తాన్‌రావు కుటుంబ సభ్యులు తొలుత టీటీడీ ఈవో ధర్మారెడ్డిని కలిసి శఠగోపం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావును ఈవో సత్కరించారు. అనంతరం తిరుచానూర్‌లో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు శఠగోపం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం : ఏపీఈపీడీసీఎల్ జోన్-1 మద్దిలపాలెం మెయిన్ రోడ్డు ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంట ల వరకూ మద్దిలపాలెం, చైతన్యనగర్, గాయత్రి స్కూల్, భానునగర్, కృష్ణా కళాశాల, జేఆర్ నగర్, ఇసుకతోట ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

అప్పన్న అన్నదాన పథకానికి రూ.4 లక్షల విరాళం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అన్నదాన పథకానికి గురువారం న్యూకాలనీలోని అక్షయ ఆస్పత్రి యాజమాన్యం రూ.4 లక్షల విరాళం దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు చెక్కు రూపంలో అందజేశారు.

పెదగదిలి వంతెన సిద్ధం

- రూ. 4 కోట్లతో నిర్మాణం
- రెండున్నర నెలల్లో అందుబాటులోకి..
- జీవీఎంసీ అధికారుల పనితీరుపై ఆరిలోవ వాసుల హర్షం



బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకలు



పూర్తయిన పెదగదిలి వంతెన

ఆరిలోవ: ఓ చిన్నపాటి ఇల్లు కట్టాలంటేనే దాదాపు ఏడాది పడుతుంది. అటువంటిది ఓ వంతెన నిర్మించాలంటే ఆధునిక పరికరాలు ఉపయోగించినా కనీసం రెండేళ్లు పడుతుంది. కానీ రెండున్నర నెలల్లో ఓ గెడ్డపై పెద్ద వంతెన కట్టి ఔరా అనిపించారు జీవీఎంసీ అధికారులు. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అంటూ ఆ ప్రాంత ప్రజలు సంభ్రమాశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో గెడ్డపై వంతెన నిర్మాణానికి జనవరి 23న మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఫిబ్రవరి మధ్యలో పనులకు శ్రీకారం చుట్టారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కృషితో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం జీవీఎంసీ అధికారులు సుమారు రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. ఐదు లైన్ల బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా తోటగరువు వరకు వెడల్పయిన రోడ్డు ఉంది. ఈ రెండింటి మధ్య గెడ్డపై ఇరుకైన 30 అడుగుల బ్రిడ్జి ఉండేది. ఈ ఇరుకు బ్రిడ్జి వల్ల వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడేవారు. ఈ సమస్య కొన్ని దశాబ్దాలుగా ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మోక్షం కలగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఇక్కడ ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారు. దీని కోసం నిధులు కేటాయించి పనులు చకచకా జరిపించారు. దీంతో రెండున్నర నెలల్లో ఈ బ్రిడ్జి సిద్ధమైంది. ఇరుకుగా ఉండే ఈ బ్రిడ్జిని ఇప్పుడు 80 అడుగులకు విస్తరించారు. దీనిపై ప్రస్తుతం బీటీ వేయాల్సి ఉంది. మిగిలిన పనులన్నీ పూర్తికావడంతో రెండు రోజులుగా వాహనాల రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నా యి. త్వరగా నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకురావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండున్నర నెలల్లో పూర్తి చేయడం ప్రశంసనీయం



పెదగదిలి, తోటగరువు మధ్య గెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులు రెండున్నర నెలల్లో అధికారులు పూరి చేయడం ప్రశంసనీయం. సుమారు రూ.4 కోట్ల నిధులతో ఈ వంతెన నిర్మాణం జరిగింది. దీంతో పాటు పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్‌గర్ కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం డివైడర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– గొలగాని హరి వెంకటకుమారి, నగర మేయర్

ఉజ్వల భవితకు బాటలు వేస్తా..



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ హామీ
- ఎంవీపీ కాలనీ సిద్ధం సభకు భారీగా తరలివచ్చిన 18వ వార్డు ప్రజలు



సభకు హాజరైన 18వ వార్డు ప్రజలు

ఎంవీపీ కాలనీ: భుజాలపై చేతులేసి ప్రజలను మద్యం మత్తులోకి దింపే వెలగపూడి రామకృష్ణబాబును కాకుండా.. పేదల సంక్షేమం, పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని ఎంవీవీ సత్యనారాయణ తూర్పు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. వెలగపూడి ఏ రోజైనా మీ సంక్షేమానికి, మీ పిల్లల భవిష్యత్‌కు కృషి చేశాడా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో వెలగపూడిని ఇంటికి సాగనంపాలన్నారు. 18వ వార్డులో ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లో గురువారం జరిగిన మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలను అభివృద్ధిలో నిలపాలని, యువతకు అంతర్జాతీయంగా ఉజ్వల భవిత ఇవ్వాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సేవకు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఎంవీవీ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నట్టు చెప్పారు. రూ.కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇదే తరహాలో వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి ముంగిట నిలిపేందుకు శక్తివంచన లేకుండా సేవలందిస్తానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకారులకు అన్ని రకాల సంక్షేమ పథకాలతో పాటు వేట విరామం సమయంలో భృతిని సైతం అందించారన్నారు. హుద్‌హుద్ ఇళ్ల కేటాయింపు, అర్హులకు స్థలాలు ఇలా అన్నింటా మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించామన్నారు. మేలు పొందిన ప్రతి ఇల్లు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. ఈ సభలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ నాయకులు అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, వాసుపల్లి జానకీరామ్, వాసుపల్లి ఎల్లాజీ, పలువురు డైరెక్టర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు

- టీడీపీ హామీలన్నీ మోసపూరితం
- మాజీ ఎమ్మెల్యే భానుమతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భానుమతి

బీచ్ రోడ్డు: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్సార్‌సీపీకే ప్రజలు మద్దతు ఉందని మాజీ ఎమ్మెల్యే భానుమతి తెలిపారు. గురువారం బీచ్‌రోడ్డులోని ఆమె తన కార్యాలయంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి రఘురాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఐదేళ్ల పాటు పాలన సాగించారన్నారు. మహిళా అభివృద్ధి, వైద్యం, విద్యా రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తున్న వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఓటేయాలని కోరారు. టీడీపీ నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను వంచించాలని చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో సంక్షేమం అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని ప్రచారం చేసిన బాబు టీం ఇప్పుడు రెట్టింపు సంక్షేమం ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది కేవలం ప్రజలను మోసం చేయటమే తప్ప ఆచరణ సాధ్యం కాదన్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికి అందాల్సిన పింఛన్‌ను అందకుండా చేసి అవ్వాతాతల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని చంద్రబాబుపై మండిపడ్డారు. లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ నిధులను కూడా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి విడుదల కాకుండా టీడీపీ నాయకులు కుట్ర చేశారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి తన ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని స్పష్టం చేశారు. ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించి మేనిఫెస్టోను విడుదల చేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఏఎంసీలో ఓటు అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు ఈ సందర్భంగా వైద్య విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఓటింగ్ అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్, పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన



ఫ్యాన్, ఓటర్ బ్యాలెట్ నమూనాలతో ప్రచారం చేస్తున్న జగన్ అభిమాన సంఘం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమాన సంఘం సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ ఎంవీపీ కాలనీ, పెదవాల్తేర్‌లలోని షాపులు, వాణిజ్య సముదాయాల్లో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు పాశాల బాలభాస్కర్ మాట్లాడుతూ మరోసారి ప్రజా సంక్షేమ పాలన రావాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అవినీతి, అరాచకాలు పెరుగుతాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే నాయకుడు జగన్ అనే విశ్వాసం రాష్ట్ర ప్రజల అందరిలోనూ ఉందన్నారు. తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్‌వీ రమణ, ఎం.సూర్యారావు, అనీల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీవీ కుటుంబ సభ్యుల ముమ్మర ప్రచారం



డెయిరీ ఫారం వద్ద ఎంవీవీ సతీమణి నాగజ్యోతి, తనయుడు శరత్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం ఎన్నికల ప్రచారాలతో హోరెత్తుతోంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయన కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో భాగస్వాములయ్యారు. ఇందులో భాగంగా గురువారం ఎంవీవీ సతీమణి ముళ్లపూడి నాగజ్యోతి, తనయుడు శరత్, కోడలు జ్ఞానిత వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం చేశారు. ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ పర్యటించారు. మధ్యమధ్యలో ప్రజలను కలిసి మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంవీవీ సత్యనారాయణను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ప్రారంభించారు. అక్కడి నుంచి దుర్గాబజార్, టీబీసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ, ఉషోదయ కూడలి, పోలమాంబ గుడి మీదుగా సిరిపురం కూడలి, చినవాల్తేరు కూడలి, వీఎంఆర్‌డీఏ పార్కు, వాల్తేరు ఆర్టీసీ డిపో మీదుగా లాసన్స్‌బే కాలనీ పార్టీ కార్యాలయం వరకు ఈ ప్రచారం సాగింది. దారి పొడవున మహిళలు వారికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, బొండా శ్రీనివాస్, వైదా నారాయణరావు, గన్నమనేని పద్మ, మందాడి రాధిక, సందిని సీతాలక్ష్మి, శ్రీదేవి, బాష, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-5లోని 106 పోలింగ్ బూత్ పరిధిలో కార్పొరేటర్ గేదెల లావణ్య విస్తృత ప్రచారం చేశారు. తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నండూరి సుబ్రహ్మణ్యం, చింతాడ శ్రీను, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో..

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గేదెల లావణ్య, తదితరులు



20వ వార్డులో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

అభివృద్ధి దిశగా అడుగులు

డెవలప్‌మెంట్ వాచ్

- 23వ వార్డులో రూ. 8.23 కోట్లతో పనులు
- రోడ్లు, కాలువల ఆధునికీకరణ



కాలనీలో సాగుతున్న కాలువ ఆధునికీకరణ పనులు



అద్దంలా మెరిసిపోతున్న మద్దిలపాలెం రోడ్డు

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తూర్పు నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తోంది. గతంలో టీడీపీ హయాంలో ఎక్కడి వేసిన గొంగలి అక్కడే చందంగా అభివృద్ధి కుంటిపడిపోయింది. ఇందుకు 23వ వార్డు కూడా అతీతం కాదు. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రావడం.. 2021లో కార్పొరేషన్ ఎన్నికలు జరిగి కొత్త పాలక వర్గం పగ్గాలు చేపట్టడంతో వార్డుల్లో అభివృద్ధి పట్టాలెక్కింది. రోడ్లు, కాలువలు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణాలతో పాటు శ్మశానవాటికల అభివృద్ధి పనులు చురుగ్గా సాగాయి. ప్రధాన రోడ్లతో పాటు కాలనీలో రహదారులు తారురోడ్ల నిర్మాణంతో కళకళలాడుతున్నాయి. మూడేళ్లలో వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులకు రూ.8.23 కోట్లు జీవీఎంసీ నిధులు కేటాయించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ధ్యేయంతో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి అభ్యర్థన మేరకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి భారీగా నిధులు కేటాయించారు.

రూ.1.66 కోట్లతో తారురోడ్లు

వార్డులో ప్రధాన రహదారుల ఆధునికీకరణకు రూ.1.66 కోట్లు వెచ్చించారు. 3.5 కిలో మీటర్ల మేరకు తారురోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో అస్తవ్యస్తంగా గోతులమయంగా ఉండే రోడ్లు అద్దంలా మెరిసిపోతున్నాయి.

రూ.15.92 లక్షలతో సీసీ రోడ్లు

వార్డులో రూ.15.92 లక్షలతో 2 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్లతో వీధులకు కొత్త కళ సంతరించుకుంది. గతంలో చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారిన రోడ్లు నేడు సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి.

రూ.3.01 కోట్లతో కాలువల ఆధునికీకరణ

చినుకు పడితే చాలు మద్దిలపాలెంలో పలు ప్రాంతాలు మునిగిపోయే పరిస్థితి ఉండేది. దీంతో వర్ష కాలం వస్తే బిక్కుబిక్కుమంటూ కాలనీవాసులు గడిపేవారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.3.01 కోట్లతో కాలనీల్లో కాలువలతో పాటు రోడ్ల ఆధునికీకరణ చేపట్టారు. ప్రస్తుతం కాలనీల్లోని కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పోయింది.

రూ.25 లక్షలతో బస్ షెల్టర్ల నిర్మాణం

వార్డులో రెండు చోట్ల కొత్తగా బస్ షెల్టర్ల నిర్మాణం చేశారు. ఇందు కోసం రూ.25 లక్షలు వెచ్చించారు.

రూ.1.94 కోట్లతో శ్మశానవాటికలో వసతులు

కాలనీలో శిథిలమైన రెండు శ్మశానవాటికలను అభివృద్ధి చేశారు. ఇందు కోసం రూ.1.94 కోట్లు వెచ్చించారు. శ్మశానవాటికల్లో బోరు బావుల ఏర్పాటు, రక్షణ గోడ నిర్మాణం, తదితర సదుపాయాలు కల్పించారు. అంతే కాకుండా మరో 12 మరమ్మతు పనులకు రూ.97 వేలు ఖర్చు చేశారు.

రోడ్లు బాగుపడ్డాయి..



మద్దిలపాలెంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవి. ఇప్పుడు ప్రభుత్వం చొరవతో కొత్త రోడ్లు వేశారు. ఏ కాలనీ చూసినా కొత్త రోడ్లతో కళకళలాడుతున్నాయి. ఎక్కడికక్కడ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో సైతం పట్టపగల్లా ఉంటోంది.

– కె.దుర్గాజీ, మద్దిలపాలెం

ముంపు భయం తప్పింది



చినుకుపడితే చాలు కాలువలో మురుగునీరు రోడ్డుపై పొంగిపొర్లేది. దుర్వాసంతో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఎక్కడికక్కడ కాలువల ఆధునికీకరణ చేశారు. దీంతో మురుగునీరు నిలిచిపోకుండా సాఫీగా కిందకి పోతోంది. వర్షపు నీరు సైతం నిలిచిపోవడం లేదు. ముంపు భయం తప్పింది.

– సిహెచ్.జయమ్మ, చైతన్యనగర్

మూడేళ్లలో అద్భుతంగా అభివృద్ధి చేశాం..



వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశాం. గత మూడేళ్లలో రూ.8.23 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి పనులు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో వార్డులో ప్రాంతాల భేదం లేకుండా అన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కాలనీలో కాలువల ఆధునికీకరణ జరగకపోవడంతో వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడేశారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.3.01 కోట్లతో కాలువలను అభివృద్ధి చేశాం . తాగునీటి సదుపాయం కల్పనకు 100 కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేశాం. ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించింది.

– గుడ్ల విజయసాయి, 23వ వార్డు కార్పొరేటర్

శిశుగృహ సందర్శన



సీడీపీవో రమణకుమారి, సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

మద్రిపాలెం: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గురువారం ఆర్ అండ్ బీ దరి మద్రిపాలెంలోని శిశుగృహ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతు న్న చిన్నారుల యోగక్షేమాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు దస్త్రాలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీడీపీవో రమణకుమారి, డీసీపీవో లక్ష్మి, పీవోఎన్ఐసీ మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.